ముల్లంగి వెంకట రమణారెడ్డి
39-18-1, మాధవధార
విశాఖపట్నం-530 007
ఫోన్: 0891-2722189

# ఘోస్ట్‌రైటర్

రాత్రంతా రాసుకున్న స్క్రిప్ట్ కాగితాల్ని బ్యాగులో కుక్కేసుకొని బయటపడదామనుకునే టైంలో వచ్చిందా అమ్మాయి... ఇరవై ఏళ్లుంటాయేమో... గులాబీరంగు పంజాబీ డ్రెస్... గుండ్రని మొహం... పెద్దకళ్లు... సన్నటి ముక్కు.. చిన్ని పెదవులు.. వీటన్నింటికి తోడు ఆమె తెలుగమ్మాయి కాదు అనడానికి నుదుటిమీద అడ్డంగా... విభూతి బొట్టు.

నేనున్న గది పక్క పోర్షన్‌లోనే వారు కింద దిగారు. తండ్రీ కూతుళ్లు ఇద్దరేనేమో... తండ్రి పూర్తి రోగగ్రస్థుడిలా మంచాన పడి... దగ్గుతూ వుండటం మినహా వాళ్లింట్లోంచి ఏ అలికిడీ విన్పించదు. కళ్లతో చూసి నవ్వుకోవటం తప్ప... ఆమె మాట్లాడింది ఇప్పుడే.

“ఉంగల్ వీట్టిల్ కాఫీ ఇరుక్కు” (మీ ఇంట్లో కాఫీ పౌడర్ వుందా?) అని తమిళంలో అడిగింది.

సినిమారైటర్ని కావాలన్న పిచ్చితో మద్రాస్‌లో కూడా కొన్నాళ్లు తిరిగాను కాబట్టి... నాకు తమిళం అర్థమవుతుంది కాని మాట్లాడలేను.

"నేను బ్యాచిలర్ని. నా గదిలో కాఫీ పొడులు, టీ పొడులు వుండవు" అన్నాను. నా తెలుగు కొంత అర్థమైనట్టుంది.

"పొగట్టుం... షుగర్ ఇరుందాల్ రెండు స్పూన్ కుడుక్కరింగలా... అప్పావులి టాబ్లెట్స్ పొడరీనం... డికాక్షన్ అణాళుం సెంజిట్టు కొడుక్కణం ఎన"

(పోనీ... షుగర్ వుంటే రెండు స్పూన్లు ఇవ్వరా... నాన్న గార్కి టాబ్లెట్స్ వేయాలి. కనీసం డికాక్షన్ అయినా కాచిపోద్దామని...) అంది.

"టీపొడి, చక్కెర భార్యాభర్తల్లాంటివి. భలే వారే. అది లేకుండా ఇదెలా వుంటుందండి. సారీ..." అన్నాను. 'సారీ' అన్నది మాత్రమే అర్థమైనట్టుంది.

లోపల్నించి ముసలాయన దగ్గు విపరీతంగా వినొస్తుంది.

కన్నీళ్లు ఆవిరైపోతున్నాయి. డిజిటల్ సౌండ్ల మధ్య.. ఎన్నెన్నో రికార్డ్ చేయని ఆకలి కేకలు... అంగుళం మేకప్ కింద... అంగాంగం తొక్కివేయబడే రంగుల రంగమిది. గదికి తాళం వేసి మెట్లుదిగి వస్తుంటే... ఇంటి యజమాని కొడుకువచ్చాడు పుస్తకంతో...

"అంకుల్... ఈ పద్యానికి అర్థం చెప్పండంటూ... గటగటా చదివేశాడు.

'దొరలు దోచలేరు... దొంగలెత్తుకుపోరు...విద్య నిగూఢ విత్తము...' అంటూ సాగే పద్యమిది. నాకు నవ్వొచ్చింది. దాని అర్థం చెప్పి అబ్బాయిని పంపించాను. పాపం పద్యం రాసిన కవి ఈనాటి సినిమారంగం గురించి ఊహించి వుండడు. కాదేది దొంగతనానికి అనర్హం అన్న రీతిలో ఇక్కడ విద్యకూడా దొంగలించబడుతుంది. అవసరమనుకుంటే... ఇదే పద్యాన్ని సినిమాలో పెట్టేసుకొని తమ పేరు వేసుకునే మేధావులున్నారీ రంగంలో, ప్చ్...

రోడ్డుపైకొచ్చాను.

మనిషి రోడ్డున పడ్డాడు !!

శివరాం డైరెక్టర్ని కల్సి రాత్రి రాసుకున్న స్టోరీ సినాప్సిస్ చెప్పాలి. ఎలాగైనా ఒప్పించాలి. అని డైరెక్టర్ ఇంటికి ఫోన్ చేశాను.

"ఆయనిప్పుడే అన్నపూర్ణ స్టూడియోలో జరిగే 'వయసే పూలతోట' చిత్రం ఫిఫ్టీడేస్ ఫంక్షన్కి చీఫ్గెస్ట్గా వెళ్లారని" ఓ ఆడగొంతు చెప్పింది.

ఈడ్చుకుంటూ అన్నపూర్ణ స్టూడియోకి వెళ్లాను.

నేను వెళ్లేసరికి సెక్యూరిటీ లోపలికి వెళ్లనివ్వకపోవటంతో... ఓ వ్యక్తి ఘర్షణపడుతున్నాడు. నేనతన్ని చూసి 'హాయ్... భార్గవ్" అన్నాను. అతడు ఫిలింనగర్ రోడ్లమీదే పరిచయమైన సగటు రచయిత.

అతడూ ఎండలోపడి వచ్చాడేమో... చెమటలు పోస్తున్నాయి.

"చూడండ్సార్. ఇన్విటేషన్ లేనిదే లోపలికి వెళ్లనివ్వనంటున్నాడు" అతడు నాతో చెప్పేలోగా రెండు కార్లు రాగానే... అలర్ట్‌గా శాల్యూట్‌చేసి గేట్ తీశాడు.

గేటుమీద పెద్ద బ్యానర్.. 'వయసే పూలతోట అర్థ శతదినోత్సవం' అని.

"ఏమయ్యా... ఆయనెవరో తెల్సా?" అన్నాను సెక్యూరిటీ నుద్దేశించి.

"ఎవరైతే నాకేంటి సార్. ఇన్విటేషన్ లేనిదే ఎవరూ పోరాదు" కటువుగా అన్నాడు.

"ఈ సినిమా రైటరయ్యా బాబూ... ఈ సిన్మా కథ రాసింది తనే" అన్నాను. నా మాట ఆవగింజంతైనా విన్పించుకోలేదు.

ఇక నేను వెళ్లటం కూడా సాధ్యపడదు అన్న విషయం అర్థమైంది.

"రా బాసూ... ఇకవాడు మనల్ని పోనీడు. సిగరెట్టయినా లాగిద్దాం" అని నా భుజంమీద చెయ్యేసి భార్గవ్ కదలటంతో... స్టూడియో రోడ్డుకి అవతలి ప్రక్కన వున్న సిమెంట్ చప్టామీద చతికిలపడ్డాం.

స్టూడియో గేటు దగ్గర స్పీకర్ పెట్టినట్టున్నారు. దండల ప్రోగ్రాం కావచ్చు. చప్పట్లు విపరీతంగా విన్పిస్తున్నాయి.

"ఏం గురూ... ఏం రాస్తున్నావ్?" అనడిగాడు భార్గవ్ సిగరెట్ అంటించి.

"ప్చ్... అన్నాను నిర్లిప్తతతో.

భార్గవ్ నవ్వాడు.

"నేను ఇండస్ట్రీకొచ్చి పన్నెండేళ్లయింది బ్రదర్. ఇదిగో ఇదే నా ఫుల్‌లెంత్ మొదటి సినిమా. చాలా సంవత్సరాలు డెబ్బయ్ సీన్లతో కథ చెప్తే... ఈ సీనొకటి బావుంది అని ఆ సీన్ తీస్కొని వెయ్యో, రెండువేలో ఇస్తే గడుపుకొచ్చాను. ఇంకొన్నాళ్లు ఓ ప్రముఖ రచయిత దగ్గర నెలకి నాలుగువేల జీతంమీద ఘోస్ట్‌రైటర్‌గా పని చేశాను. ఆయన రాసిన ఎనభై రెండు సినిమాల్లో పదకొండు పూర్తిగా నావే. ఒక్కో సినిమాకోసం రెండు నెలలు కష్టపడితే ఎనిమిదివేలు జీతం. ఆయనకి మాత్రం సినిమాకి ఆరవై లక్షలు... కసి బ్రదర్... కసి పెంచుకోవాలి... నువ్వు ఏడాదికే డీలాపడితే ఎలా?" అన్నాడు.

"మరి నీకు ఈ సిన్మా ఫంక్షన్ ఇన్విటేషన్ రాలేదా...?" అన్నాను ఆశ్చర్యంగా.

"నువ్వింకా చాలా అమాయకుడివి బ్రదర్. ఆ మాటలు విను..." అన్నాడు స్పీకర్‌వైపు కళ్లతోనే చూపిస్తూ...

ఎవరో మాట్లాడుతున్నారు.

"ఈ సినిమాకి కథే హీరో... ఇంతగొప్ప కథని నా జీవితంలో చూళ్లేదు. ఈ కథవల్లే సినిమా ఇన్ని రోజులాడిందంటే ఆశ్చర్యం కాదు. ఇప్పుడే కాదు. ఏనాటికైనా సినిమాకి కథే హీరో... మంచి కథలు వచ్చినంతకాలం నిర్మాతలు, నటులు, టెక్నీషియన్లు పచ్చగా వర్ధిల్లుతారు. అలాంటి మంచి కథ ఈ చిత్రానికి ప్రాణం పోసింది. అందుకే కథే ఈ సిన్మాకి హీరో అని ఇప్పటివరకూ అందరూ చెప్పారు. నేనింకా నొక్కి చెప్తున్నాను.

భార్గవ్ మళ్లీ నవ్వాడు.

నా గుండెనెవరో పిండేసినట్లయింది.

"నిజంగా ఎంత బాధాకరమైన విషయం... కాయని పొగుడుతూ చెట్టు పేరుని మర్చిపోతున్నారు." నా కళ్లల్లో నీటిపొర ఎగిసివచ్చింది.

భార్గవ్ అది గమనించినట్టున్నాడు. నా భుజాన్ని నొక్కి...

"తమ్ముడూ... సినిమా రంగానికి రాయాలంటే... స్పందించి రాయటం మానుకో... ఎందుకంటే... గుండెల్లో తడివుంటే మాత్రం.. రోజూ ఏడుస్తావ్. ఒకవేళ నవ్వు బాగా రాసినా హీరో బామ్మర్ది దగ్గర్నించి... హీరోయిన్ తల్లి వరకూ దాంట్లో కాలుపెడతారు. స్క్రీన్‌మీద నీ కథని నువ్వే చూస్కొని... ఇంటికెళ్లి ఏడుస్తావ్... హీరోల ఇమేజ్‌ల్లోకి వెళ్లి కథల్రాయాలి తప్ప... నీ కథల్లోకి ఏ హీరో రాడు. వాళ్లకేం కావాలో వాళ్లకే తెలీదు... ఎలా నిలదొక్కుకుంటావో... బెస్టాఫ్‌లక్" అన్నాడు సిగరెట్ దమ్ము గట్టిగా తీసి.

ఆ తర్వాత హిట్ సిన్మాలు, ప్లాఫ్ సిన్మాలు, ఫ్లాష్ సిన్మాల మీద గంటసేపు గడిచింది. ఇంతలో స్టూడియో మెయిన్ గేట్ తెరవగానే... ఒకదాని వెనక ఒకటిగా కార్లన్ని రయ్‌రయ్‌మంటూ వెళ్లిపోయాయి.

భార్గవ్ దగ్గర సెలవు తీసుకొని... డైరెక్టర్ వేటలో పడ్డాను. కాని ఆయన దొరకలేదు. రోజంతా టీలతో గడిపి... రాత్రి ఎనిమిదింటికి గదికొచ్చాను. బ్యాగ్‌ని నీరసంగా విసిరికొట్టి... చాపమీద కూలబడ్డాను.

తమిళ అమ్మాయి వచ్చింది "ఎదావదు సాప్టిటీంగలా...?"

(ఏమైనా తిన్నావా?) అడిగింది.

నేనేమీ చెప్పలేదు.

అయిదు నిమిషాల్లో ఒకటిన్నర చపాతీ... టమోట చట్నీ ప్లేట్‌లో పెట్టుకొని వచ్చి నా ముందుంచి 'తిను' అని వెళ్లిపోయింది.

ఆకలి బాధ... ఎంత తొందరగా అర్థమవుతోంది. ఆబగా తిన్నాను. కూజాలోని నీళ్లు తాగి... మరో సబ్జెక్టు గురించి ఆలోచిస్తూ పడుకున్నాను.

ఎట్టకేలకు నాలుగు రోజులకు డైరెక్టర్‌ని దొరకబుచ్చుకొని... ఆయనిచ్చిన అరగంట టైంలో వీలైనంత క్లుప్తంగా రెండు కథలు చెప్పాను. పెదవి విరిచాడాయన. మళ్లీ కలవమన్నాడు. అన్నాడే గాని... మళ్లీ దొరకలేదు. ఓసారి ఆయన కోసం వెళ్లి వస్తుంటే... జూనియర్ ఆర్టిస్ట్ సప్లయర్ ఖలీల్ ఇంటి దగ్గర తమిళమ్మాయి కనపడింది. నన్ను చూడగానే తలదించుకుంది. నేను దగ్గరి దాకా వచ్చాక కూడా కనీసం తలెత్తి చూడలేదు. ఆమెను విష్ చేస్తే ఫీలవుతుందని మౌనంగా వచ్చేశాను.

ఆరోజు రాత్రి...పెనం మీద వేయించిన బ్రెడ్‌ముక్కలు ప్లేట్‌లో తీసుకొచ్చి పెట్టింది. 'మా నాన్నగారి ఆరోగ్యం రోజు రోజుకీ పాడవుతుంది. నేను సంపాదించే ఇరవై, ముప్ఫయ్ రూపాయలతో ఇంకా మందులేమొస్తాయి. అందుకే మందులివ్వటం మానేశాను. చాలీచాలని మా తిండిలోంచే... కొంచెం మాత్రమే పెడుతున్నాను. ఆకలి బాధ నాకు బాగా తెలుసు..." గబగబా తమిళంలో చెప్పేసి వెళ్లిపోయింది.

నాకెందుకో... ఈ సినిమా ఇండస్ట్రీ నించి ఇంటికి వెళ్లిపోవాలనిపించింది. నా తోటి వాళ్లంతా ఉద్యోగాలు చేస్తూ, పెళ్ళిళ్లు చేసుకొని ఎంజాయ్‌గా ఉంటే... రంగుల ప్రపంచమ్మీద రైటర్‌గా వెలిగిపోవాలని రంగు రంగుల కలలు కనివచ్చి... రెండేళ్లయినా ఏం సాధించాను?

నా కడుపులో ఆకలి బదులు దుఃఖం పొర్లింది.

భగవంతుడా... ఓ మనిషిని పిచ్చివాన్ని చేయాలనుకంటే... వాడికి నీ దగ్గరున్న లలితకళల్లో ఏదో ఒకటి తగిలిస్తావ్ కదూ...

ఈ ఇండస్ట్రీలో ఎవరు సినిమా మొదలెట్టినా... మొదట బలయ్యేది కథా రచయితే!

ఆ రాత్రి ఆలోచనలతో నిద్రపట్టలేదు... అలాంటి రాత్రులెన్నెన్నో...???

❀ ❀ ❀

మళ్లీ ఓ రోజు మరో డైరెక్టర్ సుధీంద్రని ఆయన గెస్ట్‌హౌస్‌లో కలిశాను. మరో రెండు కథలు వినిపించాను. బావున్నాయి, బాగా లేవు ఏదీ చెప్పలేదు. చివరగా 'నీకో తమిళ సిన్మా చూపిస్తాను. ఆ సినిమా కాన్సెప్ట్‌ని అర్థం చేసుకొని తెలుగు నేటివిటీ కనుగుణంగా... ఇంతకుముందు నువ్వు చెప్పిన కథల్లోని అయిదారు సీన్స్ పనికొచ్చేవి (చెప్పాడతను) అతికించి... కథని డెవలప్ చేయి. నీకు వెయ్యి రూపాయలిస్తాను. కథ నా పేరే వేసుకుంటాను" అన్నాడు.

'ఘోస్ట్ రైటర్‌గా మారుతున్నానేమో' అని మనసులో అనుకొని 'సరేసర్' అన్నాను.

'ఆయన నన్ను టీవి ముందు కూచోబెట్టి సిడి ప్లే చేసి వెళ్లిపోయాడు.

రెండున్నర గంటల తమిళ సిన్మా చూసి గుండె ద్రవించిపోయింది.

ఎంత గొప్ప కథ...?!!

మనసు ఒప్పుకోకపోయినా తప్పదనుకొని... కాగితం తీస్కొని ఆ రోజు పగలూ, రాత్రి కూచొని సీన్‌వైజ్‌గా రాసి తెల్లారి వచ్చిన డైరెక్టర్‌కి వినిపించాను.

"ఒకే... బాగానే ఉంది. మిగతా మార్పులు, చేర్పులు నేను చేసుకుంటాను" అని షేక్‌హ్యాండిచ్చి... వెయ్యి రూపాయలు చేతిలో పెట్టాడు.

ఆ డబ్బునిచూశాక ఏమాత్రం ఫీలవలేదు... జేబులో పెట్టుకొని బయటికొచ్చాను.

❀ ❀ ❀

ఇంటిముందు ఆటో దిగగానే... ఎక్కువ మంది కనపడటంతో... అనుమానంగా మెట్లెక్కసాగాను.

వాడలోని వాళ్లందరి మొహాల్లోనూ విషాదచ్ఛాయలు... నా గది ముందుకొచ్చి... పక్క పోర్షన్‌వైపు చేసి అవాక్కయ్యాను.

తమిళమ్మాయి వాళ్ల తండ్రి చనిపోయాడు. శవం పక్కనే దీనంగా ఏడుస్తూ ఆ అమ్మాయి...

గుండె కలుక్కుమంది.

"ఎప్పుడు చనిపోయారు?" అనడిగాను ఇంటి ఓనర్‌ని.

"రాత్రి మూడు గంటలకి పోయాడట. ఆ అమ్మాయొక్కర్తే ఉంది..." అన్నాడు.

అప్పుడే శవాన్ని చూడటానికొచ్చిన ఓ సీనియర్ కో డైరెక్టర్.

"పాపం... ఒకప్పుడాయన ఎంత గొప్పగా బతికాడు. తమిళంలో ఆయనకు మంచి పేరుంది" అన్నాడు. నేను విస్తుపోయాను.

"అవునా... ఏం చేసేసేవారు" అన్నాను.

"అదేంటయ్యా బాబూ... ఆయన రాసిన సినిమాలు సూపర్‌హిట్. ఆమధ్య ఆయన రాసిన కన్నీరిన్ జ్వాలైంగిల్ (కన్నీటి మంటలు) సిన్మా తమిళంలో రెండొందల రోజులాడింది..."

ఆ మాట విన్న నా గుండె... బ్లో అవుట్‌లా పేలింది.

'కణ్ణీరిన్ జ్వాలైంగల్ కథ ఆయన రాసారా?" అన్నాను పైకి.

'నిన్న రాత్రంతా నేను తెలుగులో కాపీ చేసిన తమిళ కథ... ఈ మహాత్ముడు రాసిందా?'

మనసు ముక్కలవుతోంది...

తల బద్దలవుతోంది...

కళ్లగోళాల్ని ఫెటేల్మని ఢీకొంటున్న కన్నీటి కెరటాలు...

దీనంగా ఆమె సన్నటి ఏడ్పు... శూలాల్లా తాకుతోంది.

అప్రయత్నంగానే జేబులోంచి వెయ్యి రూపాయలు తీసి... గది లోపలికి వెళ్లి ఆ అమ్మాయి చేతిలో పెట్టాను.

దహనం చేయడానిక్కూడా ఆమె చేతిలో చిల్లిగవ్వలేదని నాకు తెలుసు. ఆమె కన్నీళ్లతో చేతులెత్తి మొక్కింది.

నేను శవంవైపు తిరిగి కళ్లు మూసుకొని ప్రార్థించాను.

"నీ కష్టార్జితం నీకే చేరింది. నేను నిమిత్త మాత్రుడిని... అంటే ఘోస్ట్ రైటర్ని... ఓ మహా రచయితా... నన్ను క్షమించు..."

ఆయన పాదాలకు నమస్కరించాను.